ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్

– ఆర్వో హరిప్రసాద్

మదనపల్లె : ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు రాజకీయపార్టీల నేతలు పూర్తి సహకారం అందించాలని మదనపల్లె నియోజకవర్గ ఎన్నికల అధికారి హరిప్రసాద్ కోరారు. శుక్రవారం సబ్ కలెక్టరేట్‌లోని ఆర్వో కార్యాలయంలో ఎన్నికల్లో పోటీచేసిన వివిధ రాజకీయపార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లుకు కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, నూతన మార్గదర్శకాలను అభ్యర్థులకు వివరించారు. ఎన్ని గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి. కౌంటింగ్ కేంద్రంలో చేయాల్సినవి, చేయకూడని విధులను వివరించారు. జూన్ 4వ తేదీ మంగళవారం ఉదయం అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లు తెరవాల్సి ఉన్నందున, అభ్యర్థులు ఉదయం 5 గంటలకు రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 7 గంటలలోపు రావాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ప్రవేశానికి ఐడీ కార్డులు తప్పనిసరి అని, సెల్‌ఫోన్లు లోనికి అనుమతించడం జరగదన్నారు. కౌంటింగ్ కేంద్రం బీఎస్ఎఫ్ కేంద్రబలగాల పహారాలో, 3 దశల్లో పటిష్టమైన సెక్యూరిటీ ఏర్పాట్లలో ఉన్నందున ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో వ్యవహరించాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే బయటకు పంపేయడం జరుగుతుందన్నారు. అరుపులు, కేకలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని, చట్టప్రకారం నడుచుకోవాలన్నారు. పోస్టల్‌బ్యాలెట్ కౌంటింగ్‌లో ఎన్నికల సంఘం నూతన మార్గదర్శకాలను అనుసరిస్తామన్నారు. ప్రజలు ఎన్నుకున్న వారే ప్రజాస్వామ్యంలో పాలన సాగిస్తారని, అధికారులు ఎలాంటి పక్షపాతధోరణి ఉండదని, నిష్పక్షపాతంగా, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తామన్నారు. హింసాత్మక ఘటనలకు దూరంగా ఉండాలని సూచించారు. కోడ్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని, ఎంతటివారైనా ఉపేక్షించమని స్పష్టం చేశారు. కౌంటింగ్ రూమ్‌లోకి సెల్‌ఫోన్‌లతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని తెలిపారు. అభ్యర్థులు లేదా ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రానికి వచ్చేటప్పుడు పెన్ను, పెన్సిల్, నోట్‌ప్యాడ్, 17సీ డూప్లికేట్ కాపీ తెచ్చుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మహమ్మద్ ఆబిద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, వైఎస్సార్ సీపీ డాక్టర్ విభాగం జిల్లా అధ్యక్షులు అనిల్‌కుమార్, నజీర్‌ఖాన్, ఇంతియాజ్, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా, నాదెళ్లవిద్యాసాగర్, రాటకొండనవీన్, ఇండిపెండెంట్ అభ్యర్థులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్వో హరిప్రసాద్



పీలేరు: మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమా

కౌంటింగ్ ప్రక్రియపై శిక్షణ

పీలేరు : ఈ నెల 4న నిర్వహించనున్న ఓట్లు లెక్కింపు కార్యక్రమంపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమా శిక్షణ ఇచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్‌వో కార్యాలయంలో అభ్యర్థులు, ఏజెంట్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల నిబంధనలకు లోబడి అభ్యర్థులు, ఏజెంట్లు నడుచుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, నూతన మార్గదర్శకాలను వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహబూబ్‌బాషా, ఎన్నికల డీటీ సుబ్రమణ్యం, వివిధ పార్టీల ఏజెంట్లు పాల్గొన్నారు.

ఎగ్జిట్ పోల్స్ తర్వాత ఎలాంటి అల్లర్లకు పాల్పడరాదు

పీలేరు రూరల్ : ఎగ్జిట్ పోల్స్ తర్వాత ఎలాంటి అల్లర్లు, విజయోత్సవాలు నిర్వహించరాదని పీలేరు సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు సోషల్ మీడియాలో రెచ్చగొట్టేవిధంగా పోస్టులు పెట్టడం, నిబంధనలు ఉల్లంఘించడం లాంటి చర్యలు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అసత్య ప్రచారాలు, విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లదే బాధ్యతని హెచ్చరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

తంబళ్లపల్లె: సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల4వ తేదీ చేపట్టనున్న సందర్భంగా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ములకలచెరువు సీఐ మధు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక పోలీసులు, సీఆర్‌ఎఫ్ బలకాలు కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 144 సెక్షన్, పోలీస్–30 యాక్టు అమలులో ఉంటుందని, జనం గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు. రోడ్లపైకి వచ్చి ఇతరులకు ఇబ్బంది కలిగేలా, రెచ్చగొట్టేలా సంభాషణలు చేయకూడదన్నారు. అసాంఘిక కార్యక్రమాలు చేపట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి 2024–25 విద్యా సంవత్సరానికి గానూ ఆసక్తి కలిగి పదవ తరగతి ఉత్తీర్ణులైన వారి నుంచి రెండు/మూడు సంవత్సరాల డిప్లమో కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలికిరి ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లమో ఇన్ అగ్రికల్చర్, డిప్లమో ఇన్ సీడ్ టెక్నాలజీ, డిప్లమో ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్, డిప్లమో ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ లోపు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 8008104977, 9000523420, 8008554448 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

ధర్మం, న్యాయానిదే అంతిమ విజయం

కలకడ : సమాజంలో ధర్మం, న్యాయానిదే అంతిమ విజయమని శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రభోదానంద బోధించారని ప్రభోదాసేవా సమితి సభ్యులు ఏడుకొండలు అన్నారు. శుక్రవారం మండలంలోని కదిరాయచెర్వు, బొంతలవారిపల్లె, చెరువుముందరపల్లె, ఎగువతాండ, దిగువతాండ, ఒంటిళ్ళు, రంగప్పగారిపల్లె, చీకటిపల్లి, కురవపల్లి, కుమ్మరపల్లె, గ్రామాలలో దొనకొండ రథం ద్వారా త్రైత సిద్ధాతం–భగవద్గీత గురించి తెలియజేసి పుస్తకాలను పంపిణీ చేశారు. భగవద్గీతలో ఎక్కడా అహింస మార్గం ఎంచుకోమని తెలియజేయలేదన్నారు. తోటి వారికి సహాయం చేయడమే మానవవ జీవిత లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారని తెలియజేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు అశోక్‌బాబు, బాలాజీ, రవికుమార్, సంతోష్, ఉదయ్, రెడ్డెమ్మ, వాణిశ్రీ, రేఖకళ్యాణి, ఝాన్సీ, సిద్దార్థ, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల మెరుపు దాడులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లి సమీప అటవీ ప్రాంతాల్లో శుక్రవారం పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. సదరు ప్రాంతాల్లో పేకాట, కోడి పందేలు జోరుగా సాగుతోందని పలువురు ఫోన్ ద్వారా ములకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధుకు వివరించారు. సీఐ ఆదేశాల మేరకు పీటీఎం, ములకలచెరువు ఎస్ఐలు రవీంద్రబాబు, తిప్పేస్వామిలు సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే పరిసర ప్రాంతాలను క్షుణంగా పరిశీలించినా ఎక్కడా పేకాట, కోడి పందేలు జరగకపోవడంతో తాము వెనుదిరిగామని పోలీసులు తెలిపారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

కేవీపల్లె : స్థానిక ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శుక్రవారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు రెడ్డిబాషా, సుబ్రమణ్యం మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యత, శుభ్రత పాటించాలన్నారు. మెనూ ప్రకారం వండే విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కలికిరి: మండలంలోని మేడికుర్తి గ్రామం రేగుంటవారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డెప్ప రెడ్డి తండ్రి సి.చిన్నపరెడ్డి (72) ఇటీవల మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శుక్రవారం రేగుంటవారిపల్లికి చేరుకుని సి.చిన్నపరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రత్నశేఖర్ రెడ్డి, డాక్టర్ రమణ, మహేంద్రరెడ్డి, బాబురెడ్డి, వేణురెడ్డి తదితరులు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

ఎద్దు పొడిచి రైతుకు గాయాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పట్టెంవాండ్లపల్లికి చెందిన వెంకట్రమణ అనే రైతును శుక్రవారం ఎద్దు పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి సమీపంలోని వ్యవసాయ బోరు వద్ద రైతు ఎద్దులకు మేత వేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుందని గ్రామస్థులు పేర్కొన్నారు. కుటుంబీకులు గాయపడిన రైతును చికిత్స నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు



ఎస్ఐ రవీంద్రబాబు

పెద్దతిప్పసముద్రం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఈ నెల 4న వెలువడనున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల ప్రజలు సంయమనం పాటించి స్నేహ పూర్వకంగా మెలగాలని ఎస్ఐ రవీంద్రబాబు సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ 144 సెక్షన్ అమలులో ఉన్నందున కౌంటింగ్ రోజు ఎక్కడా బాణా సంచా, టపాకాయలు పేల్చరాదని, ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. పోలీసు చట్టాలను అతిక్రమించి ఇతరులకు ఇబ్బంది కలిగేలా, రెచ్చగొట్టేలా సంభాషణలు, అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

సాంకేతిక రంగాల్లో పరిశోధనలు కీలకం

–డీఆర్‌డీఓ జాయింట్ డైరెక్టర్ రాంప్రభు

మదనపల్లె సిటీ: సమకాలీన సమస్యలను పరిష్కరించడానికి సాంకేతిక రంగాల్లో పరిశోధనలు ఎంతో కీలకమని డీఆర్‌డీఓ జాయింట్ డైరెక్టర్ టీ.రాంప్రభు అన్నారు. శుక్రవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో సెకండ్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో భాగంగా కాంటెంపరరీ ఇష్యూస్ ఇన్ సైన్స్ ఇంజినీరింగ్ టెక్నాలజీ సెమినార్ నిర్వహించారు. ఇలాంటి సదస్సులు వల్ల విద్యార్థులలో సైన్సు, ఇంజనీరింగ్ పట్ల నైపుణ్యాన్ని, కొత్త ఆవిష్కరణలు చేయడానికి దోహదపడతాయని తెలిపారు. సదస్సులో పలు ప్రాంతాలకు చెందిన 108 రీసెర్చ్ పేపర్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌బాబు, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, కో ఆర్డినేటర్లు డాక్టర్ అమరనాథ్, సుబ్రమణ్యం, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.



సావనీర్ విడుదల చేస్తున్న అతిథులు

ఆర్టీసీ ఉద్యోగుల సేవలు అభినందనీయం

పీలేరురూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సేవలు అభినందనీయమని ఆర్ఎం రాము అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో పదవీ విరమణ పొందిన కండక్టర్ కె. నాగరాజ, ఎస్. మదుసూదన్, ఇ. రెడ్డెప్పనాయుడుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ముగ్గురు కండక్టర్లు పీలేరు డిపోలో సుమారు 27 సంవత్సరాల పాటు పనిచేసి ఇక్కడే పదవీ విరమణ పొందారన్నారు. వారు చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. పదవీ విరమణ పొందిన అనంతరం వారి శేష జీవితం సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎం కుమార్, సీఐ సుబ్బమ్మ, ఎస్టీఐ బాబు నాయక్, యూనియన్ నాయకులు రాజు, సి.వి. రమణ, ఖాదర్‌బాషా, వలి, యల్లయ్య, కె. నాయుడు, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.



నాగరాజ దంపతులను సన్మానిస్తున్న ఆర్ఎం రాము

ఘనంగా మాసమ్మ గంధమహోత్సవం

పెద్దమండ్యం: పెద్దమండ్యం కుషావతీ నది ఒడ్డున వెలసిన మాసమ్మ తల్లి గంధమహోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. మాసాబావి వద్ద ప్రత్యేక వాహనంలో గంధం ఉంచి పురవీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా బళ్లారి డ్రమ్స్ వాయిద్యాలు, బాణా సంచా భక్తులను, ప్రజలను ఆకట్టుకున్నాయి. గంధం మహోత్సవానికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తనయుడు పెద్దిరెడ్డి అభినయ్‌రెడ్డి, కలిచెర్ల సింగిల్ విండో చైర్మన్ కడప సుధాహరరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున గంధ మహోత్సవంలో కడప అమీన్‌పీర్ దర్గా పపీరాధిపతి ఆరీఫుల్లా హుసేనీ పాల్గొన్నారు. మసాబావి దర్గా కమిటీ సభ్యులు కడప అమీన్‌దర్గా పీఠాధిపతికి ఘనస్వాగతం పలికారు. పెద్దమండ్యం సర్పంచ్ సోదనపల్లె బాషా అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, ఎంపీటీసీ మంచూరి జయరాం, మసాబావి దర్గాకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



మసాబావి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అభినయ్‌రెడ్డి, సుధాహరరెడ్డి

ప్రయాణికులకు మెరుగైన సేవలు

మదనపల్లె సిటీ: ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని 1 డిపో–1 మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక డిపో కార్యాలయంలో మదనపల్లె–బి.కొత్తకోట మార్గంలో లక్కీడిప్ తీశారు. ఆర్టీసీ మారుమూల గ్రామాలకు సైతం సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. త్వరలో హైదరాబాదుకు సూపర్‌లగ్జరీ బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. లక్కీడిప్‌లో మొదటి బహుమతి ఎ.రెడ్డిప్రసాద్, రెండవ బహుమతిత వి.రమణప్ప, మూడవ బహుమతి గురుప్రకాష్ విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. జూన్ నెలలో మదనపల్లె–తంబళ్లపల్లె రూట్‌లో లక్కీడిప్ తీయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు తమ టిక్కెట్లు వెనుక పేరు, సెల్ నంబర్లు రాసి గిఫ్టబాక్సులో వేయాలని కోరారు. కార్యక్రమంల సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.



లక్కీడిప్ తీస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

ఎన్నికల నిబంధనలకు లోబడి నడుచుకోవాలి



మాట్లాడుతున్న స్పెషల్ డీఎస్పీ మోహన్‌రావు

స్పెషల్ డీఎస్పీ మోహన్‌రావు

కేవీపల్లె : ఈ నెల 4 ఓట్ల లెక్కింపు రోజున ఎన్నికల నిబంధనలకు లోబడి నడుచుకోవాలని స్పెషల్ డీఎస్పీ మోహన్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రాజకీయ పార్టీ నాయకులకు, కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జూన్ 4న రాయచోటి సాయి ఇంజనీరింగ్ కళాశాలలో మూడంచెల భద్రత నడుమ పోలీస్ నిఘా నీడలో కౌంటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థుల తప్ప ఎవరినీ లోనికి అనుమతించబోమని హెచ్చరించారు. 4వ తేదీ ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్, సీఆర్, పీసీ, 30 పోలీస్ యాక్టు అమల్లో ఉంటుందన్నారు. ఫలితాలు వెలువడిన అనంతరం సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రహీముల్లా పాల్గొన్నారు.

పొగాకుతో ప్రాణాంతక వ్యాధులు

పీలేరు : పొగాకు తాగడం వలన ప్రాణాంతక వ్యాధులకు గురికావాల్సి వస్తుందని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముడుపులవేములలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకులో ఉన్న హాని కరమైన విషపదార్థాల వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, గుండె జబ్బులు, పక్షవాతము, గుండెపోటు, ఊబకాయం తదితర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. పొగాకుకు దూరంగా ఉంటే జీవితాలు ఆనందమయంగా ఉంటాయని తెలిపారు. పొగాకు తాగడం వల్ల యువకులు చెడు మార్గంలో పయనించే ప్రమాదం ఉందన్నారు. పొగాకు అలవాటు ఉన్నవారు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తలపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆరోగ్య సిబ్బంది కొండయ్య, వసుందర, నాగముత్యం, ధరణి, రెడ్డిమోహన్ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

మదనపల్లె : పొగాకు సంబంధిత ఉత్పత్తులు వినియోగించడం వల్ల కేన్సర్ బారినపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నందున, ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ఎం.ఎస్.రాజు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఆర్ఎంఓ డాక్టర్.ప్రసాద్‌రాజు ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెడికల్ కాలేజ్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ఎం.ఎస్.రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పొగాకు, పొగాకు సంబంధిత ఉత్పత్తులు తీసుకోవడం వల్ల లంగ్, ఓరల్ కేన్సర్లతో పాటు అన్నవాహిక, గర్భసంచి, యూరిన్‌బ్లాడర్, రొమ్ము కేన్సర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. పొగాకు వల్ల ఎన్నో జీవితాలు నాశనమవుతున్నాయని, దీనిపై ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ధూమపానం చేసేవారి ఆరోగ్యంతో పాటుగా జీవితాన్ని కాల్చేస్తుందన్నారు.

పొగాకు వినియోగం ఆరోగ్యానికి చేటు

వాల్మీకిపురం: ప్రస్తుతం సమాజంలో పొగాకు వాడకం అధికంగా ఉందని, దీని వలన వ్యక్తులకు కేన్సర్, టీబీ లాంటి జబ్బులకు గురికావాల్సి వస్తోందని స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సిబ్బందికి, రోగులకు, ప్రజలకు పొగాకు సేవించడం వలన వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పొగాకును వాడనీయం .. వ్యాధులను దరి చేరనీయం అంటూ వైద్య సిబ్బందిచే ఆమె ప్రతిజ్ఞ చేయించారు. అలాగే మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి ఆధ్వర్యంలో ప్రజలకు పొగాకు వలన వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. పొగాకు వల్ల ఎన్నో జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. అలాగే జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని డ్రైవర్లకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు రవికుమార్, శివాని, హర్షిత, హిమబిందు, సోని, కిషోర్, సిబ్బంది నాగిరెడ్డి, సుధాకర్, మహమ్మద్ రఫీ, మురళి, గోవిందమ్మ, నూరని, సరస్వతి, బాబాఫక్రుద్దిన్, జావీద్, విజ్ఞాన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



మదనపల్లెలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

ఆదర్శ ఉపాధ్యాయుడు శంకరయ్య

కలకడ : ప్రభుత్వ పాఠశాల, విద్యాభివృద్ధిలో తనదైన ప్రత్యేక ముద్ర వేసుకుని ఆదర్శ ఉపాధ్యాయుడిగా నడిమిచెర్ల జిల్లాపరిషత్‌ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాత్రి. శంకరయ్య పేరు తెచ్చుకున్నారని సర్పంచ్ నల్లమ్మనరసింహారెడ్డి, ఆ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం నడిమిచెర్ల ఉన్నతపాఠశాలలో శంకరయ్య పదవీ విరమణ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు పుష్పావతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. స్కూల్ అసిస్టెంట్‌గా ఉపాధ్యాయ వృత్తిలో చేరిన శంకరయ్య ఎంతో మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో క్లష్టర్ ప్రధానోపాధ్యాయులు చంగల్‌రాయుడు (కోన), శ్రీనివాసులురెడ్డి. వైవి రమణ, పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం, శశిధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రెడ్డిశేఖర్, ప్రసాద్, రామయ్య, అనిత, అశోక్, ఖాజాఫీర్, తదితరులు పాల్గొన్నారు.



శంకరయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పొగాకు రహిత సమాజం కావాలి

బి.కొత్తకోట: పొగాకు రహిత సమాజం కోసం ప్రజలు చిత్తశుద్ధిగా సహకరించాలని స్థానిక సిహెచ్ సీ మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో రోగులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నో టొబాకో డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాటి ద్వారా అనారోగ్య పరిస్థితులు కలుగుతాయని, దీనిపై అవగాహన పెంచుకోవాలని కోరారు. అనంతరం ఆస్పత్రి ఎదుట సిబ్బందితో ప్లకార్డు ప్రదర్శించారు. స్థానికులకు పొగాకు వినియోగం వల్ల కలిగే ప్రమాదంపై అవగాహన కల్పించారు. వైద్యులు హసీనా, దుర్గాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో పడిన వ్యక్తి మృతి

మదనపల్లె: ప్రమాదవశాత్తూ కాలువలో పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. తాలూకా సీఐ ఎస్. శేఖర్ తెలిపిన మేరకు వివరాలిలా... సత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం నడింపల్లెకు చెందిన వెంకటరమణ(42) వ్యక్తిగత పనులపై మదనపల్లి మండలం పెంచుపాడుకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు స్థానికంగా ఉన్న బస్సు స్టాప్ వద్ద కూర్చుని ఉండగా, ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న కాలువలోకి జారి పడిపోయాడు. ప్రమాదంలో బాధితుడు తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానిక వైద్యులు చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్సలు పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి

పీలేరు : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సూపర్‌స్టార్ కృష్ణ జయంతి ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు పసుపులేటి వెంకటరమణ మాట్లాడుతూ సాంకేతి తెలుగు చిత్ర రంగాన్ని హాలీవుడ్ స్థాయికి తీసుకెళ్లిన ఘనత సూపర్‌స్టార్ కృష్ణకు దక్కుతుందన్నారు. 350 చిత్రాల్లో నటించి అభిమానులను మెప్పించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎండి షఫీ, పూల భాస్కర, రామ్మూర్తి, షేక్ సాదిక్‌బాషా, మయూర్‌నాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

పీలేరు రూరల్ : స్థానిక డీ ఆర్ట్స్ డ్యాన్స్ ఇన్సిస్టిట్యూట్, డ్యాన్స్ జోన్ ఇన్సిస్టిట్యూట్‌లలో సమ్మర్ క్యాంప్ నృత్యంపై శిక్షణ పొందిన విద్యార్థులకు ఇన్సిస్టిట్యూట్ నిర్వాహకులు బన్నీ మస్తాన్, సుహేల్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో సమ్మర్‌క్యాంప్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సౌకర్యాలు తక్కువగా ఉన్న పీలేరులో విద్యార్థులకు వివిధ రకాల నాణ్యమైన నృత్యం నేరిస్తున్నట్లు తెలిపారు.